క్లుప్తంగా

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



నూజివీడు: సమాజంలో ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సెయింట్ థామస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ చిన్నప రెడ్డి అన్నారు. పట్టణంలో సెయింట్ థామస్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు 8వ ఆంధ్రా ఎయిర్ స్క్వాడ్రన్ వింగ్ కమాండర్ అజిత్ సింగ్ ఆదేశాల మేరకు గురువారం నో డ్రగ్స్ ఇన్ ఇండియా ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు అలవాటైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. ముఖ్యంగా యువత చదువుపై దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. యువత అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, యువత పాత్ర ఎంతో కీలకమైనదని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కేవీ శ్రీనివాస్, క్యాడెట్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఆలయ అర్చకులు వేణుగోపాల స్వామి, అమ్మవార్లకు మల్లెపూలతో విశేష అర్చనలు జరిపిన అనంతరం భక్తులతో సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరింపజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ సంధ్య పర్యవేక్షించారు.

పిడుగుపాటుకు విద్యుత్ సామగ్రి ధ్వంసం



చాట్రాయి: మండలంలో గురువారం సాయంత్రం వర్షం, మెరుపులు, ఉరుములతో పిడుగులు పడ్డాయి. నరసింహారావుపాలెం గ్రామానికి చెందిన అల్లడ చెన్నారావు ఇంటి ముందు చెట్టుపై పిడుగు పడడంతో ఆ ధాటికి పరిసరాల్లోని గృహాల్లో సుమారు 20 టీవీలు, బల్బులు, ఫ్యాన్లు ధ్వంసమయ్యాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతి



మైలవరం: మైలవరం జాతీయ రహదారిలో దర్గా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడు పాడి గేదెలు మృతి చెందగా మరో గేదె తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. మైలవరానికి చెందిన ఒరుగు వెంకటేశ్వరరావుకు చెందిన పాడి గేదెలు మైలవరంలోని భద్రాచలం - విజయవాడ జాతీయ రహదారిలో వెళుతూ ఉండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మూడు పాడి గేదెలు మృతి చెందగా మరో గేదె తీవ్రంగా గాయపడింది. ఒక్కొక్క గేదె రూ.లక్ష వరకు ఉంటుందని వాటి యజమాని ఒరుగు వెంకటేశ్వరరావు తెలిపాడు. గేదెలే తనకు జీవనాధారమని, పాల అమ్మకాల మీద తనకు వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు బాధితుడు వాపోయాడు. ప్రస్తుతం గేదెలు మృతి చెందడంతో తాను తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): అదనపు కట్నం కోసం భర్త వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. నున్న పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపాడు గ్రామానికి చెందిన నందిపాము స్నేహలతకు జి.కొండూరు మండలం గంగినేనిపాలెం గ్రామస్తుడు నందిపాము జమలయ్యతో 2020వ సంవత్సరంలో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్నేహలత పుట్టింటి వారు వివాహ సమయంలో రెండు లక్షల రూపాయలు, బంగారం వస్తువులు కట్నంగా ఇచ్చారు. ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకొని రెండేళ్లుగా ఉంటున్నారు. అకారణంగా భర్త తరుచుగా కొడుతూ, అదనపు కట్నం కావాలని వేధింపులకు గురిచేస్తున్నాడు. అతనికి అత్త, మామ, మరిది సపోర్టు చేస్తున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

కందిపప్పు సరఫరా లేనట్టే!

- మూడు నెలలుగా కందిపప్పు అందించని కూటమి ప్రభుత్వం
- ఈ నెలలోనూ కార్డుదారులకు తప్పని నిరాశ
- 94.185 టన్నుల కందిపప్పు సరఫరాకు ప్రభుత్వం ఎగనామం

నూజివీడు: కూటమి ప్రభుత్వం వచ్చాక గత మూడు నెలల నుంచి రేషన్‌షాపుల్లో తెల్ల కార్డుదారులకు కందిపప్పు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కందిపప్పును సరఫరా చేయడంలో ప్రభుత్వం చేతులెత్తేసింది. పేదలకు ఇవ్వాల్సిన కందిపప్పునే సరఫరా చేయలేని ప్రభుత్వం రాగులు, సజ్జలు ఇంకేమిస్తుందని కార్డుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌షాపుల్లో కందిపప్పు కనపడదేమోననే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం, పంచదారతోనే సరి..

తెల్లరేషన్ కార్డుదారులకు మే నెలలో కూడా కందిపప్పు సరఫరా చేయడంలేదు. మార్చి నెల నుంచి కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇచ్చి సరిపెడుతున్నారు. కూటమి ప్రభుత్వం పేదవాడు పప్పన్నంతో కడుపారా తిండి తినే పరిస్థితులను లేకుండా చేస్తోంది. రేషన్ బియ్యాన్ని కేంద్రం ఇస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం కార్డుదారుడికి కేవలం అర కేజీ పంచదార ఇచ్చి చేతులు దులిపేసుకుంటోంది. ఒక వైపు సంక్షేమ పథకాలన్నింటినీ అటకెక్కించడంతో పాటు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకుండా కల్లబొల్లి కబుర్లు చెబుతున్న ప్రభుత్వం నెలకు నాలుగుసార్లు పప్పన్నం తినే తమకు కందిపప్పు సరఫరాను నిలిపివేయడమేమిటని పేదలు ప్రశ్నిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర నాణ్యతను బట్టి రూ.130 నుంచి రూ.140 వరకు ఉంది. ప్రభుత్వం రేషన్‌షాపుల్లో కిలో రూ.70లకే కందిపప్పును అందజేస్తుంది. దీంతో రేషన్‌కార్డుదారులు ఎండీయూ వాహనాల వద్దే కందిపప్పును కొనుగోలు చేసేవారు. అయితే మూడు నెలలుగా కందిపప్పును సరఫరా చేయకపోవడంతో కార్డుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల క్రితం బియ్యం, పంచదార, కందిపప్పుతో పాటు గోధుమ పిండి, రాగి పిండి తదితర వాటిని రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు రాయితీపై అందజేస్తామని, రేషన్ దుకాణాలను మరింత బలోపేతం చేస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు చేశారు. అయితే ఈ ప్రకటనలు అమలుల్లోకి వస్తాయో రావో గాని ఉన్న సరుకులే తగ్గిపోతుండటం గమనార్హం.



నూజివీడులో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ బియ్యం ఇస్తున్న వాహనదారుడు (ఇన్‌సెట్) కందిపప్పు



కందిపప్పు నిలిపి వేయడం దారుణం

పేదలకు ఇచ్చే కందిపప్పును ప్రభుత్వం మూడు నెలలుగా ఇవ్వకుండా నిలిపివేయడం దారుణం. సంక్షేమ పథకాలన్నింటిని ఎగ్గొట్టిన ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా ఇచ్చే కందిపప్పును ఇవ్వకపోవడం సమంజసం కాదు. బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక్క పంచదారే ఇస్తోంది.

– పరిమి సాగర్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు, నూజివీడు



కందిపప్పుతో పాటు అన్ని సరుకులు ఇవ్వాలి

రేషన్‌షాపుల ద్వారా రాయితీపై ఇచ్చే కందిపప్పును ప్రభుత్వం నిలిపివేయడం అన్యాయం. గోధుమలు, రాగులు ఇస్తామని గతేడాది నవంబర్‌లో చెప్పారు. ఇంత వరకూ వాటి ఊసే లేదు. దీంతో పేదలు బహిరంగ మార్కెట్‌లో సరుకులు కొనడంతో అదనపు భారం అవుతుంది. కందిపప్పుతో పాటు అన్ని సరుకులు ఇవ్వాలి.

– చాట్ల పుల్లారావు, సీపీఐ పట్టణ కార్యదర్శి, నూజివీడు

మండలాల వారీగా కార్డుదారులు, అవసరమైన కందిపప్పు

మండలం	రేషన్ కార్డులు	అవసరమైన కందిపప్పు (కిలోల్లో)
ఆగిరిపల్లి	20,769	20,769
చాట్రాయి	17,331	17,331
ముసునూరు	18,515	18,515
నూజివీడు	23,922	23,922
నూజివీడు టౌన్	13,648	13,648
మొత్తం	94,185	94,185

నెలకు 94.185 టన్నుల కందిపప్పు అవసరం

నియోజకవర్గంలో 58 రేషన్ వాహనాలు, 170 రేషన్ దుకాణాలు ఉండగా 94,185 రేషన్ కార్డులు ఉన్నాయి. కార్డుకు ఒక కిలో చొప్పున 94,185 కిలోల కందిపప్పు ప్రతినెలా అవసరం ఉంది. అధికారులు మాత్రం మొత్తం అవసరంలో 90 శాతం అంటే నెలకు 80 వేల కిలోలకు మాత్రమే ఇండెంట్ పెడుతున్నారు. దానిని కూడా గత మూడు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేయకుండా ఎగ్గొట్టింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.130లకు కందిపప్పును కొనుగోలు చేసే పరిస్థితి పేదలకు ఎదురవుతోంది.

బలివే దేవస్థాన కమిటీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ముసునూరు: బలివేలోని చారిత్రక ప్రసిద్ధ బలేరామలింగేశ్వరస్వామి దేవస్థాన నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దేవదాయ శాఖ కార్యాలయం నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఈఓ వై.అలివేణీ నాగలక్ష్మి గురువారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బలివే దేవస్థాన కార్యాలయ పనివేళల్లో దరఖాస్తు పత్రాలను పొంది, ఈనెల 26వ తేదీలోగా జిల్లా దేవదాయ శాఖాధికారికి దరఖాస్తులు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు బలివే ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ధర్మకర్త పదవికి దరఖాస్తు చేసుకోండి

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో శ్రీరఘునాథస్వామి ఆలయ ధర్మకర్త పదవికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈఓ నల్లూరి సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఈఓ కార్యాలయంలో దరఖాస్తు పత్రాన్ని పొంది పూర్తిచేసిన దరఖాస్తును ఈనెల 25వ తేదీలోగా ఏలూరులోని జిల్లా దేవాదయ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసే వారు హిందువులై ఉండాలని, 30 ఏళ్ల పైన వయసు ఉండి సత్ప్రవర్తన కలిగిన వారై ఉండాలని, పోలీస్ ఎంక్వైరీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందుపర్చాలని చెప్పారు.

నేడు బహుమతుల ప్రదానం

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహించిన మాక్ టెస్ట్ ఈఏపీ సెట్(ఎంటీఈఏ–2025) ర్యాంకర్లకు గురువారం బహుమతులు ప్రదానం చేస్తామని కళాశాల యాజమాన్యం గురువారం తెలిపింది. మాక్ టెస్ట్‌కు 615 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మాక్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి 27 మంది విద్యార్థులకు రూ.5.30 లక్షలు బహుమతులుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో గురువారం ఉదయం 11 గంటలకు సెకండ్ బ్లాక్ ఈఈఈ సెమినార్ హాల్‌లో బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలం సీతారామపురానికి చెందిన పెరిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అత్తి పార్వతిని వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. దీంతో ఆమెతో పాటు పలువురు పార్టీ నాయకులు గురువారం రాత్రి మేకా ప్రతాప్ అప్పారావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని, పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం నిర్వహిద్దామని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల అనూష, నాయకులు గోళ్ల ఇస్సాకు, అత్తి మురళీ, ఆకిరెడ్డి సూర్యనారాయణ, లింగవరపు రమేష్, అడవినెక్కలం సర్పంచి వేము రాజు, ఎంపీటీసీ గుర్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావును కలిసిన పార్వతి తదితరులు

కుట్టుమిషన్ల పేరుతో కూటమి నేతల అవినీతి

తిరువూరు: రాష్ట్రంలో బీసీ మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ పేరుతో కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ బీసీ విభాగ జిల్లా అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు ఆరోపించారు. తిరువూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.100 కోట్లతో మహిళలందరికీ శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లను అందజేస్తామని మహిళా దినోత్సవం నాడు ప్రకటించిన రాష్ట్రప్రభుత్వం ఇంతవరకు కనీసం శిక్షణ కూడా ప్రారంభించలేదన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3 నుంచి 5 శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పిన కూటమి నేతలు 50 రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఒక్కచోట కూడా కుట్టుమిషన్లపై మహిళలకు శిక్షణ ఇచ్చిన దాఖలాలు లేవని నిలదీశారు. శిక్షణ పేరిట కోట్లాది రూపాయలు కొల్లగొట్టడానికి పాలకులు గుజరాత్‌లోని ఒక నాసిరకం మిషన్ల తయారీ సంస్థతో ఒప్పందం చేసుకుని మిషన్ల కొనుగోలుకు సన్నాహాలు చేస్తోందని శ్రీనివాసరావు ఆరోపించారు. ఇంత పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్న కూటమి ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, బీసీ విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు సాంబశివరావు, తిరువూరు మండల విభాగ అధ్యక్షుడు బండి అంజన్‌కుమార్, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కాలసాని గోపాల నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, కాలసాని విజయలక్ష్మి, గత్తం నాగేశ్వరరావు, యరదేశి రామారావు, పరసా శ్రీనివాసరావు, మందా శోభనం, పాపారావు, రఫీ, చలమాల సత్యనారాయణ ఉన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు, స్వామిదాసు తదితరులు

పాక్ ఉగ్రవాదుల ఏరివేతకు మద్దతు పలకాలి

ముసునూరు: పాకిస్థాన్‌లో ఉగ్రమూకల ఏరివేతకు దేశ ప్రజలంతా మద్దతు ఇవ్వాలని రమణక్కపేట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పసుమర్తి రామకృష్ణ కోరారు. హైస్కూల్‌లో విద్యార్థులు, ఎస్‌ఎంసీ సభ్యులతో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడుల అనంతరం పాక్‌లో ఉగ్రమూకల ఏరివేతకు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తదితర కార్యక్రమాలకు అందరూ మద్దతు పలకాలని కోరారు. భరతమాత నుదుట సింధూర తిలకం దిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎస్‌ఎంసీ చైర్మన్ నీలికొండ రాజా, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు అంగిడి శ్రీనివాసరావు, ఆశ వర్కర్ సూర్యకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై హర్షం

నూజివీడు: ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోళ్ల పవన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ పాక్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన సైనికులకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. దేశ భద్రతను కాపాడే యోధులను చూసి గర్వంగా ఉందన్నారు. దేశం కోసం కుల మత రాజకీయ వర్గవైషమ్యాలు విడనాడి ఐక్యంగా పోరాడాల్సిన తరుణం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.



ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు తెలుపుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలి

మైలవరం: విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని మైలవరం ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడుతూ.. గణిత స్వభావం, ప్రాముఖ్యత వివరించారు. నిజ జీవితంలో గణితానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, గుర్తించాలన్నారు. విద్యార్థులతో గణిత సూత్రాలు చెప్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథ పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మైలవరంలో గణితం బోధిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్

అన్నదాతను వణికిస్తున్న వర్షాలు

- ధాన్యం, మొక్కజొన్న రైతులకు తలపోటుగా మారిన వైనం
- కొనుగోళ్ల ఆలస్యంతో ఆందోళనలో రైతులు
- గురువారం రెండు గంటల పాటు భారీ వర్షం

జి.కొండూరు: కాలం తీరు చూస్తే వర్షాకాలం అప్పుడే వచ్చిందా అన్నట్లు ఉంది. సూర్యుడు ఉదయించినప్పటి నుంచి సాయంత్రం వరకు తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిస్తోంది. సాయంత్రం కాగానే పెనుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడి వర్షం బెంబేలెత్తిస్తోంది. గత కొద్ది రోజులుగా వర్షం కొనసాగుతుండడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోగా కొనుగోళ్లు లేక ధాన్యం, మొక్కజొన్న రైతులు వణికిపోతున్నారు. మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల్లో గురువారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఈ వర్షం దాటికి ధాన్యం, మొక్కజొన్నలు తడకుండా ఉండేలా రైతులు ముందస్తుగానే జాగ్రత్త వహించి పట్టాలు కప్పుకున్నారు. అక్కడక్కడా కొద్ది మేర ధాన్యం, మొక్కజొన్నలు తడిసింది. ప్రతి రోజూ వర్షం కురుస్తుండడంతో రైతులు నరకయాతన పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం, మొక్కజొన్నలు త్వరితగతిన కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



మైలవరం మార్కెట్ యార్డులో ధాన్యం, మొక్కజొన్నలపై కప్పిన పట్టాలు



చిలుకూరివారిగూడెంలో పిడుగు పాటుకు కాలిపోతున్న కొబ్బరి చెట్టు

మైలవరం: మండలంలో గురువారం పిడుగులతో భారీ వర్షం కురిసింది. ఇటీవల గాలి వానకు మామిడి కాయలు రాలిపోగా అరకొరగా మిగిలిన కాయలు సైతం నేలరాలాయి. చిలుకూరివారి గూడెంలోని ఓ ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడి, చెట్టు కాలిపోయింది. దీనితో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాని

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండపల్లికి చెందిన రాగాల నాని ఎంపికయ్యారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు గురువారం నియామక పత్రం అందజేశారు. రాజారావు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యవర్గం సభ్యులు నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి కమిటీలు నియమించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీలకు అందేలా కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో రాగాల నాని కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక



ఆగిరిపల్లి: నూజివీడు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దుబ్బాక దేవరాజు ఆధ్వర్యంలో ఆగిరిపల్లి మండల నూతన కమిటీని స్థానిక మార్కెట్ యార్డ్‌లో గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నల్లమోతు సన్ని, ఉపాధ్యక్షుడిగా కొవ్వలి చినబాబు, అధికార ప్రతినిధి బొబ్బర్ల సురేష, ప్రధాన కార్యదర్శి ముల్లంగి జస్వంత్‌రావు, నల్లమోతు బాలరాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లమోతు కాంచనరావు, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, కలపాల విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్‌కు వీఓలు సిద్ధంగా ఉండాలి



మైలవరం: ఆడిట్‌కు వీఓలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఏపీఎం రామకృష్ణ తెలిపారు. మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం మండలంలోని మండల మహిళా సమాఖ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగింది. సమావేశంలో ఏపీఎం రామకృష్ణ మాట్లాడుతూ వీఓలు ప్రతి నెల రెండు సమావేశాలు తప్పని సరిగా నిర్వహించాలని, పుస్తక నిర్వహణ పూర్తి చేయాలన్నారు. అర్హత ఉన్న ప్రతి గ్రూపునకు రూ.20 లక్షలు బ్యాంకు రుణాలు అందించాలని, స్త్రీనిధి రుణాలు రికవరీ ప్రతి ఒక్కరూ పేటీఎం్ ద్వారా మాత్రమే జరిగేలా చూడాలన్నారు. నగదు లావాదేవీలు ఉండకూడదన్నారు. బ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాలు రికవరిలో నూరు శాతం జిల్లాలో మొదటి స్థానంలో ఉందని చెప్పారు. మహిళలందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఉద్దేశంతో రెడ్డిగూడెం మండలాన్ని ఎంఈడీ బ్లాక్ మోడల్ మండలంగా ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బొలగాని రామకృష్ణ, ఎంఎస్ కోశాధికారి ఎన్.సుజాత, సీసీలు రత్నావళి, మణి, సుందరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సీడ్ మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం అందజేత

నూజివీడు: సీడ్ మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన రైతులు 15 మందికి గురువారం రూ.9 లక్షలకు సంబంధించిన చెక్కులను కంపెనీ ఆర్గనైజర్లు అందజేశారు. బోర్వంచకు చెందిన పేద రైతులు 30 మంది సీడ్ మొక్కజొన్న సాగు చేసి నష్టపోయారు. ఈ నేపథ్యంలో సీపీఐ, రైతుసంఘం నాయకులు వారికి అండగా నిలబడి పోరాటం చేశారు. దీంతో కంపెనీ ఆర్గనైజర్లు స్పందించి 15 మంది బాధిత రైతులకు రూ.9 లక్షలకు సంబంధించిన చెక్కులను అందించారు. సీపీఐ రాష్ట్ర సమితి నాయకుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ.. పోరాటం ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రభుత్వం, వ్యవసాయ అధికారుల నిరంతర పర్యవేక్షణ లేకపోవడంతో సీడ్ కంపెనీ ఆర్గనైజర్లు స్థానిక రాజకీయ నాయకుల అండతో రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారన్నారు. బోర్వంచ బాధిత రైతులు ఐక్యంగా ఉండి పోరాడబట్టే కంపెనీ దిగివచ్చి డబ్బులు చెల్లించిందన్నారు. సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహా మాట్లాడుతూ.. వచ్చే సీజన్‌లో రైతులు కచ్చితంగా కంపెనీలతో ఒప్పంద పత్రం రాసుకోవాలని సూచించారు. కంపెనీ వారు మిగిలిన పంట నష్టపరిహారాన్ని సాధ్యమైనంత త్వరితగతిన చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, మడుపల్లి నాగేంద్రరావు, యాదాల సురేష్, భూక్యా రంగారావు, బొప్పుడి రాంబాబు, బాధిత రైతులు పాల్గొన్నారు.



బోర్వంచ రైతులకు చెక్కులను అందజేస్తున్న కంపెనీ ఆర్గనైజర్లు

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠ

విస్సన్నపేట: మండలంలోని కలగర రామచంద్రాపురంలో గురువారం శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కనులపండువగా జరిగింది. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, స్వామి వార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచి రమ, లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న స్వామిదాసు తదితరులు